## దేవుడు పోయి.. దయ్యం వచ్చింది!

మొదటిపేజీ తరువాయి...



అందక, రుణమాఫీ కాక, సాగు నీరు అందక అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సాగునీరు లేక, చెరువులు ఎండిపోయి, భూగర్భ జలాలు పడిపోయి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై రైతులు విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో పాలకుర్తికి చెందిన మహిళా రైతు ఆక్రోషం వెళ్లగక్కిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. ఆమె మాటలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. పంటలు ఎండి.. గుండెలు మండిన ఆ రైతు ఆవేదన ఆమె మాటల్లోనే... 'ఐదెకరాల్లో వరి సాగు చేసినం. మా బోరు నీళ్లు కొంత, కాల్వ నీళ్లు కొంత వస్తయని పంట ఏసినం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. మా మీద సావు దెబ్బ కొట్టింది. ఏం లేదు. మొత్తం ఎండుకుపోయింది. దయాకర్ సార్ మమ్మల్ని ఆదుకున్నడు. మా ఎమ్మెల్యే ఎవరో గూడ తెల్వదు. కేసీఆర్ సార్, మా దయన్న సార్ నీళ్లు విడిచిపెట్టింద్రు. అబద్ధం ఎందుకు ఆడాలె. ఆ ప్రభుత్వంలో ఎప్పుడు పంటలు ఎండలె. మస్తు వడ్లు పండినయి. మస్తు బతికినం. ఇప్పుడైతే ఏం లేదు ఇగ. మాకు సావే ఉంది ఇగ. పొలాన్ని జూత్తే గుండెపోటు వస్తాంది. రైతుబంధు లేదు, మాఫీ లేదు, ఏ బంధు లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో మస్తు ఉండె. తల్లిదండ్రులు కూడా యాది రాలె. అట్ల ఉండె ఆ ప్రభుత్వంలో. ఇప్పుడు ఆ సారు (కేసీఆర్) పోయిండు.. ఆ సారూ (ఎర్రబెల్లి దయాకర్) పోయిండు. ఇగ ఉరి పెట్టుకొని సావడమే ఉంది. సచ్చిర్రా, బతికిర్రా అని సూసేటోళ్లే లేరు. మూడు మూడుసార్లు యూరియా, డీఏపీ ఏసినం. మొత్తం వేసినం. ఒక్క ఎకరానికి ఏడు వేలు, ఎనిమిది వేలు ఇస్తే నాట్లేసిన్రు. కూలీ బతుకు చేసుకుంటే అయిపోయేది. ఇట్ల వ్యవసాయం జేస్తే నాశనమైంది. అంటరుగా దేవుడు పోతే దయ్యం వస్తదని.. ఆ దేవుడు పోయిండు, దయ్యం వచ్చింది' అని మహిళా రైతు తెలిపారు.

# సొరంగంలోకి కేరళ క్యాడవర్ డాగ్స్

- రెస్క్యూ ఆపరేషన్‌కు కేరళ నుంచి తరలింపు
- దోమలపెంటకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బృందం
- ఇంకా తెలియని కార్మికుల జాడ



టన్నెల్‌లోకి క్యాడవర్ డాగ్‌ను తీసుకెళ్తున్న రెస్క్యూ బృందం

మహబూబ్‌నగర్, మార్చి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి రెండు వారాలైనా లోపల చిక్కుకున్న కార్మికుల జాడ ఇప్పటివరకు తెలియలేదు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి వివిధ రెస్క్యూ బృందాలను నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటకు రప్పించి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికీ సొరంగంలో ప్రతికూల పరిస్థితులు బృందాలకు ఆటంకంగా మారాయి. లోపల ఏం జరుగుతుందో.. ఎప్పుడు, ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితుల్లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. ప్రాణాలకు తెగించి సొరంగం లోపలికి వెళ్లి కార్మికులను రక్షించేందుకు రెస్క్యూ బృందాలు చేపడుతున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. మరోవైపు కార్మికుల ఆచూకీపై రోజు రోజుకు ఆశలు సన్నగిల్లుతున్నాయి. గురువారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం దోమలపెంటకు వచ్చింది. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కేరళ నుంచి ప్రత్యేకంగా క్యాడవర్ డాగ్స్‌ను రప్పించారు. చెన్నైకి చెందిన ఐఐటీ నిపుణులు, సింగరేణి సాంకేతిక నిపుణులు, సైనికాధికారులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఇతర అధికారులు సమీక్ష నిర్వహించి సొరంగం లోపల తాజా పరిస్థితిని అంచనా వేశారు. మొరాయించిన కన్వేయర్ బెల్టు పని చేయడం ప్రారంభించడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మట్టి, ఉబికి వస్తున్న నీటిని బయటకు పంపిస్తున్నారు.

### ప్రత్యేక హెలికాప్టర్‌లో క్యాడవర్ డాగ్స్

ఈ ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు కేరళకు చెందిన క్యాడవర్ డాగ్స్‌ను ఆర్మీకి చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో తీసుకు వచ్చారు. ఈ డాగ్స్ వెంబడి ప్రత్యేక బృందం కూడా ఎస్‌ఎల్‌బీసీ వద్దకు చేరుకున్నది. క్యాడవర్ డాగ్స్ సాయంతో ఏ ప్రాంతంలో పరిశోధనలు జరపాలనే విషయమై సమీక్షించారు. శుక్రవారం ఉదయాన్నే వాటిని స్క్వాడ్‌తో పాటు లోపలికి తీసుకెళ్తారు. మానవుల ఆనవాళ్లను పసిగట్టడంలో దిట్ట అయిన ఈ డాగ్స్ భూగర్భం లోతుల్లో చిక్కుకున్న వారిని కూడా గుర్తిస్తాయని వారు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జీపీఆర్ ద్వారా చేపట్టిన స్కాన్‌లో గుర్తించిన స్పాట్లను తవ్వగా అక్కడ మిషనరీ బయటపడటంతో ఈ ప్రక్రియ విఫలమైంది. దీంతో నిపుణుల సూచన మేరకు ఈ డాగ్స్‌ను రంగంలోకి దించారు. కాగా, ఇదివరకే స్నిఫర్ డాగ్స్‌ను లోపలికి పంపించినా ఫలితం కనిపించలేదు. బృందాలు మోకాలి లోతు బురదలో పనిచేయాల్సి వస్తున్నది. ఎట్టకేలకు 13 రోజులపాటు కష్టపడి ఒకటి నుంచి రెండు మీటర్ల బురదను బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. లోపలి నుంచి ఊబికి వస్తున్న నీరు, బురద సహాయక చర్యలకు ఆటంకంగా మారుతున్నాయి. మరోవైపు టీబీఎం మిషన్ భాగాలు కూడా చెల్లాచెదురుగా పడిపోయి, బురదలో కూరుకుపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వాడే వాటర్ పైపులను ఉపయోగించి మిషనరీపై ఉన్న బురదను తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం ఉండటంలేదు.

### కేంద్ర హోంమంత్రిత్వ బృందం పరిశీలన

టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బృందం పరిశీలించింది. మినిస్ట్రీ ఫర్ హోమ్ అఫైర్స్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రటరీ కల్నల్ కీర్తి ప్రతాప్‌సింగ్ స్వయంగా పర్యవేక్షించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందానికి రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్ టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు. రెస్క్యూ ఆపరేషన్‌పై సమీక్ష నిర్వహిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, డోగ్ర రెజిమెంట్ కమాండెంట్ పరిక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ ప్రసన్న, జయప్రకాశ్ అసోసియేట్ ఎండీ పంకజ్‌గౌర్ పాల్గొన్నారు.

### 15 అడుగుల లోతుల్లోనూ పసిగడతాయి!

#### మృతుల అన్వేషణలో క్యాడవర్ జాగిలాలు భేష్

క్యాడవర్ డాగ్స్ మానవ అవశేషాలను గుర్తించడానికి ప్రధానంగా శిక్షణ పొందాయి. శోధన, రక్షణ విభాగాల జాగిలాల మాదిరిగా కాకుండా క్యాడవర్ డాగ్స్ విభిన్నమైన పాత్రను పోషిస్తాయి. గల్లంతైన మనుషులు, మృతదేహాలను గుర్తించడంలో వీటికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. 15 అడుగుల లోతులో పాతిపెట్టిన, కుళ్లిపోయిన శరీర భాగాలు, అస్థిపంజర అవశేషాలను కూడా ఇవి గుర్తించగలవు. గాలి, భూమి లోపలి నుంచి వచ్చే వాసనలను ఇవి పసిగట్టగలవు. నీటి అడుగున ఉన్న మృతదేహాలు, మృతుల శరీర భాగాలనూ పసిగడతాయి. గుర్తుతెలియని మృతదేహాలతో మిస్టరీగా మారిన నేరాలను పరిష్కరించడానికి క్యాడవర్ డాగ్స్‌పై పోలీస్ యంత్రాంగం ఆధారపడుతున్నది. ప్రస్తుతం ఎస్‌ఎల్‌బీసీ సొరంగం రెస్క్యూ ఆపరేషన్‌లో వీటి సేవలను వినియోగించడం చర్చనీయాంశంగా మారింది.

# ప్రమాదమని తెలిసీ!

మొదటిపేజీ తరువాయి...

చేసింది. భూకంప తరంగాలను రాతి ద్రవ్యరాశిలోకి ప్రసారం చేయడం ద్వారా ప్రమాదాన్ని సంస్థ లెక్కించింది.

### నివేదికను ధ్రువీకరించిన కాంట్రాక్టు సంస్థ!

నివేదికను అందించిన విషయాన్ని ఎస్‌ఎల్‌బీసీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ 'జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్' ధ్రువీకరించినట్టు తెలిసింది. కానీ, పూర్తి వివరాలు తెలిపేందుకు నిరాకరించినట్టు సమాచారం. సర్వే చేపట్టి, నివేదిక తయారుచేసిన అంబర్గ్ టెక్ సంస్థ సైతం ఆ 'డాటా కాన్ఫిడెన్షియల్' అంటూ సమాధానాన్ని దాటవేసినట్టు తెలుస్తున్నది. రాతి శిల దృఢత్వం తగ్గడంతో పాటు నీటి ఊటకు అవకాశం ఉన్న ప్రదేశంలోనే ప్రమాదం జరిగినట్టు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నవారు చెప్పారు. ఈ జోన్ వద్ద మూడు మీటర్లు పైకప్పు కుంగినట్టు వెల్లడించారు. ఈ మొత్తం నివేదికను పనులు జరిగే ముందు కాంట్రాక్టు సంస్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి అందజేసినట్టు తెలిసింది. 2020లోనే ఎస్‌ఎల్‌బీసీ సొరంగంపై మరో నివేదికను జియోలాజికల్ సర్వే వెల్లడించింది. సొరంగం తవ్వకం పేలవమైన పద్ధతిలో ప్రారంభమైనట్టు అందులో అభిప్రాయపడింది. టీబీఎం ద్వారా నడిచే పొడవైన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్టులో ఉన్నందున బోర్ హోల్స్ డ్రిల్లింగ్, డ్రిఫ్ట్‌లకు అనుమతి లేదని స్పష్టం చేసింది.

### కాంగ్రెస్ మొండి వైఖరితోనే ప్రమాదం

సొరంగంలో 'ప్రమాదకర జోన్' ఉన్నట్టు కాంట్రాక్టు సంస్థ స్పష్టంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అవాంతరాలను వెల్లడించిన మరో నివేదికను సైతం ప్రభుత్వానికి ఇచ్చింది. పనులు చేపడితే జరిగే నష్టాన్ని కూడా వివరించింది. అయినా ఆ నివేదికలోని అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం తేలికగా తీసుకున్నది. ప్రాజెక్టులో ఉన్న ఆటంకాలు, ఇబ్బందులను సమగ్రంగా అధ్యయనం చేయకుండానే ఆఘమేఘాల మీద ప్రాజెక్టు పనులను మళ్లీ ప్రారంభించింది. నిపుణులతో చర్చించి ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లాల్సి ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వ పెద్దలు ఆలోచించకపోవడం గమనార్హం. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో ప్రమాదకర జోన్ వద్ద టీబీఎం మరమ్మతులు చేస్తుండగానే ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన చోటు నుంచి 500 మీటర్లలోనే మరో ప్రమాదకర జోన్ ఉన్నట్టు తెలిసింది. ప్రమాదం జరిగిన తర్వాత సైతం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సరిగ్గా స్పందించకపోవడంతో ఇప్పటి వరకు 8 మంది ఆచూకీ దొరకలేదు. ముఖ్యమంత్రి, మంత్రులు ఒక్కో రోజు ఒక్కో ప్రకటన చేయడంతో బాధితుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది.

### మానిటరింగ్ లేకపోవడంతోనే

గత కొన్ని రోజులుగా ప్రమాదకర జోన్ వద్ద మట్టిపెల్లలు పడుతున్నాయని, నీళ్లు కారుతున్నాయని కార్మికులు కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వ ఒత్తిడితో సదరు సంస్థ పనులను కొనసాగించింది. ప్రమాదానికి ముందు రోజు సైతం నైట్ షిఫ్ట్‌లో పనిచేసిన కార్మికులు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని, కార్మికులకు సూచించారు. మరోవైపు ఎస్‌ఎల్బీసీ టన్నెల్ పనులను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రమాదం జరిగిందని ఇంజినీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నివేదికలను ప్రభుత్వం బేఖాతరు చేస్తూ.. టన్నెల్ పనులతో వేలకోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడంతో పాటు కార్మికుల కుటుంబాల్లో శోకాన్ని మిగిల్చింది.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఫాల్ట్‌జోన్ ఉన్నదని తెలిసీ పనులు చేపట్టారు
- ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల సర్వే రిపోర్టులను బయటపెట్టాలి
- 8 మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్న రేవంత్ సర్కార్
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరుగుతుందని ముందే స్పష్టమైన సంకేతాలున్నా పనులు మొదలు పెట్టి ఎనిమిది మంది అమాయకుల ప్రాణాలను రేవంత్ సర్కార్ బలిగొన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆరోపించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించిన నివేదికలు ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ, కేవలం కమీషన్ల కోసమే పనులు చేసిందని విమర్శించారు. ఎనిమిది మంది మృతికి, రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా కావడానికి రేవంత్‌రెడ్డి సహా మంత్రివర్గం బాధ్యత వహించాలని, ఈ మొత్తం వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. టన్నెల్ పనులు చేస్తున్న జైప్రకాశ్ అసోసియేట్స్ 2020లో అంబర్గ్‌టెక్ ఏజీ అనే సంస్థతో టన్నెల్ ప్రాంతంలో సర్వే నిర్వహించినట్టు కేటీఆర్ పేర్కొన్నారు. టన్నెల్ సిస్మిక్ ప్రిడిక్షన్ (టీఎస్పీ) సర్వే చేసి ఆ ప్రమాదాన్ని 2022లోనే అంబర్గ్‌టెక్ ఏజీ ఊహించి హెచ్చరించిందని వివరించారు. టన్నెల్‌లోని 13.88 కిలోమీటర్ వద్ద నుంచి 13.91 కిలోమీటర్ మధ్య ఫాల్ట్‌జోన్ ఉన్నదని స్పష్టంగా చెప్పారని, ఆ ప్రాంతంలోని రాళ్లు ధృడంగా లేకపోవడంతోపాటు నీటి లీకేజీలు భారీగా ఉన్న విషయాన్ని హైలెట్ చేశారని తెలిపారు. ఆ నివేదికలో పేర్కొన్నట్టుగానే ప్రమాదం ఫాల్ట్‌జోన్‌లోనే జరిగిందని పేర్కొన్నారు. 2022లోనే జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ జనరల్ మండపల్లి రాజు, జైప్రకాశ్ అసోసియేట్స్ భూగర్భ శాస్త్రవేత్త రితురాజ్ దేశ్‌ముఖ్ చేసిన మరో సర్వే రిపోర్ట్ కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. టన్నెల్ ఉపరితలాన్ని సరిగా అంచనా వేయకుండానే నిర్మాణ పనులు మొదలుపెట్టారని ఆరోపించారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్లో ప్రమాదం జరుగుతుందని ముందే హెచ్చరించిన ఆ నివేదికలను రేవంత్ ప్రభుత్వం దాచి పెట్టి కార్మికులతో పనులు చేయించిందని మండిపడ్డారు. ఆ నివేదికలను బయటపెట్టకపోవటమే కాకుండా ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవటంతో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ నివేదికలను బయటపెట్టడంతోపాటు ఘటనపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమగ్ర జరిపించాలని డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త పాలసీ

- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడి
- ది జర్నలిస్టు కో ఆపరేషన్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి త్వరలో కొత్త పాలసీ తీసుకురానున్నట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ది జర్నలిస్టు కో ఆపరేషన్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జర్నలిజంలో పని చేస్తున్న మహిళలు యజమానులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఉపయోగపడే కథనాలు వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, ది జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, కార్యదర్శి రవీంద్ర బాబు, సంయుక్త కార్యదర్శి చల్లా భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కోటాపై తీర్మానం!

మొదటిపేజీ తరువాయి...

ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపామని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని, సమావేశ నిర్ణయాలను కేంద్రానికి నివేదించాలని నిర్ణయించామని చెప్పారు. తెలంగాణను మూడు కోర్ ఏరియాలుగా విభజించామని తెలిపారు. ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వరకు రెండు కిలోమీటర్ల వరకు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం ప్రత్యేకంగా 90 పోస్టులను మంజూరు చేశామని చెప్పారు. హెచ్‌ఎండీఏను భారీగా విస్తరించనున్నామని, దాని పరిధిలోకి 11 జిల్లాలు, 104 మండలాలతో 1355 గ్రామాలు రానున్నాయని వివరించారు. వీటిలో కొత్తగా 332 రెవెన్యూ గ్రామాలు ఏర్పాటవుతాయని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను లక్షాధికారులను చేయనున్నామని మంత్రి చెప్పారు. ఇందుకోసం మహిళా శక్తి–2025 పాలసీని ఆమోదించామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యత్వానికి వయో పరిమితిని 15 నుంచి 65 ఏండ్లుగా నిర్ణయించామని చెప్పారు. టీటీడీ బోర్డులా యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి బోర్డు ఏర్పాటుకు ఆమోదం తెలిపామని అన్నారు. ఇందుకోసం 1987 దేవాదాయ చట్టాన్ని సవరించనున్నామని తెలిపారు. అలాగే27 కొత్త పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని చెప్పారు.

### మరిన్ని నిర్ణయాలు

నాగార్జున సాగర్ హైవే నుంచి శ్రీశైలం హైవే మధ్యలో గల 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి నిర్ణయం.

- ఇందిరా మహిళా శక్తి మిషన్–2025కి ఆమోదం. ఒకే గొడుకు కిందకు మహిళా సంఘాలు. మహిళా సంఘాల్లో సభ్యత్వ వయస్సు 15కు తగ్గింపు. గరిష్ఠ వయస్సు 65 ఏళ్లకు పెంపు.
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట బోర్డు ఏర్పాటుకు నిర్ణయం.
- 10954 రెవెన్యూ గ్రామాలకు రెవెన్యూ అధికారుల నియామకం.
- గంధమల్ల రిజర్వాయర్ కెపాసిటీని 4.28 టీఎంసీల నుంచి 1.41 టీఎంసీలకు తగ్గించాలని నిర్ణయం.
- పెద్ద గోల్కొండ సమీపంలో ఈఎస్ఐ దవాఖాన నిర్మాణానికి 5.15 ఎకరాల కేంద్ర ప్రభుత్వ స్థలం బదాలాయింపునకు ఆమోదం.
- పారాలింపిక్స్‌లో కాంస్య పతక విజేత దీప్తి జీవాంజీకి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం.
- కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాల్లో 361 పోస్టులు మంజూరు. అదే విధంగా గురుకులాల్లో 330 పోస్టులు మంజూరు.

# పొంగులేటి ముక్తసరి!

- పూర్తిగా సైలెంట్ అయిపోయిన రెవెన్యూశాఖ మంత్రి
- మొన్నటివరకు కీలకంగా వ్యవహరించిన వైనం .. ప్రభుత్వంలో నం.2 తానేనన్నట్టు హడావుడి
- ఇప్పుడు కంటికి కనిపించని స్థితి
- సీఎంతో విభేదాలే కారణమంటూ పార్టీలో ప్రచారం
- ముఖ్యమంత్రే ఆయనను పక్కన పెట్టారంటూ గుసగుసలు



హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి కొద్దికాలంగా సైలెంట్ అయిపోయారు. మొన్నటిదాకా ప్రభుత్వంలో అన్నీ తానే అన్నట్టు హడావిడి చేసిన ఆయన.. ఇప్పుడు సడీసప్పుడు చేయడం లేదు. ఒక దశలో ప్రభుత్వంలో నం.2గా ప్రచారం చేసుకున్న ఆయన.. ఇప్పుడు కనిపించడమే కరువైంది. చీటికిమాటికి విలేకరుల సమావేశాలు నిర్వహిస్తూ.. లక్ష్మీబాంబులు, అరెస్టులు అంటూ ప్రకటనలు చేస్తూ తెగ హంగామా చేసేవారు. సీఎం రేవంత్‌రెడ్డితో అత్యంత సన్నిహితంగా మెలిగేవారు. కానీ ఇప్పుడు సీఎంతో కలిసి కనిపించడమే గగనమైంది. పొంగులేటి మౌనం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చాలాకాలం తరువాత ఆయన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కనిపించారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఆయన ఒంటరయ్యారనే చర్చ జరుగుతున్నది.

### భూ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి మౌనం

సొంత పార్టీ ఎమ్మెల్యేలే మంత్రి పొంగులేటిపై భూ ఆక్రమణ ఆరోపణలు చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఓ భూమికి సంబంధించి మంత్రి పొంగులేటిపై పరోక్షంగా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అనిరుధ్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రికే ఫిర్యాదు చేసినట్టు సమాచారం. మరి కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా మంత్రి పొంగులేటిపై పలు ఆరోపణలు చేసినట్టు తెలిసింది. ఇదంతా అధిష్ఠానం ముందుకు కూడా వెళ్లింది. పొంగులేటిపై ఆరోపణల వెనక ఎవరి హస్తం ఉందనే చర్చ కూడా జోరుగా సాగింది. ఈ వ్యవహారంతో మంత్రి పొంగులేటి తీవ్రంగా ఇబ్బంది పడినట్టు తెలిసింది. ఇక అప్పటినుంచి ఆయన సైలెంట్‌గా ఉండాలని నిర్ణయించుకున్నట్టు సన్నిహితులు చెప్తున్నారు.

### మంత్రిని దూరం పెట్టిన సీఎం !

ప్రభుత్వం ఏర్పడింది మొదలు ఇటీవలి వరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి మధ్య మంచి సమన్వయం ఉండేది. ఎక్కడ ఏ మీటింగ్ జరిగినా ఇద్దరూ హాజరయ్యేవారు. సీఎం పక్కనే పొంగులేటికి సీటు వేసేవారు. స్టేజీపై కూడా ఇద్దరు పిచ్చాపాటిగా ముచ్చటించుకునేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మంత్రి పొంగులేటిని ముఖ్యమంత్రి దూరం పెట్టినట్టు కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది. ఓవైపు భూ ఆరోపణలు, మరోవైపు నం.2గా ప్రచారం చేసుకోవడం, ఇంకోవైపు బీజేపీతో అంటకాగుతున్నారనే ఆరోపణలతో సీఎం ఆయనకు దూరంగా జరిగినట్టు తెలుస్తున్నది. ముందుజాగ్రత్త చర్యలో భాగంగానే ముఖ్యమంత్రి ఆయనను దూరం పెట్టినట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పొంగులేటి సీఎం సీటుపై కన్నేశారని, ఇందులో భాగంగానే బీజేపీతో అంటకాగుతున్నారనే ప్రచారం జరిగింది. ఆ క్రమంలోనే విదేశీ వాచీల వ్యవహారంలో ఐటీ దాడులు జరిగినా.. అది ముందుకు వెళ్లలేదు. దీంతో మంత్రి పొంగులేటి, కేంద్రం మధ్య సంబంధాలపై మరింత అనుమానం పెరిగినట్టు తెలిసింది. దీంతో మంత్రిని బలహీనపరచాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డే ఎమ్మెల్యేలతో భూ ఆరోపణలు చేయించినట్టు పార్టీలో చర్చ జరుగుతున్నది.

## సర్వత్రా వ్యతిరేకత.. పడిపోయిన గ్రాఫ్!

అధికారంలో వచ్చిన తొలినాళ్లతో పోల్చితే మంత్రి పొంగులేటి పొలిటికల్ గ్రాఫ్ భారీగా పడిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన చేసిన ప్రకటనలు అమలు కాకపోవడంతో పార్టీ, ప్రజల దృష్టిలో చులకనయ్యారు. బీఆర్‌ఎస్‌పై, కేటీఆర్ అరెస్ట్‌పై బాంబులు పేలుతాయంటూ ఆయన చేసిన ప్రకటనలు తుస్సుమన్నాయి. ఇందిరమ్మ ఇండ్ల విషయంలోనూ ఇదే జరిగింది. దీనికితోడు ఆయన తీరుపై ఇంటా బయట విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆయన వ్యవహారశైలిపై సొంత శాఖ ఉద్యోగులతో పాటు సొంత జిల్లా, సొంత నియోజకవర్గ నేతలు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఆయనకు అత్యంత దగ్గరగా పనిచేసే వ్యక్తులు కూడా 'మా సార్ గ్రాఫ్ పడిపోయింది' అని వ్యాఖ్యానించడం గమనార్హం. సొంత శాఖకు చెందిన ఉన్నతాధికారులను కింది స్థాయి ఉద్యోగుల ముందే మందలించడంతో వారు ఆయనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. ఇక నియోజకవర్గ నేతలు తమకేమీ పనులు కావడం లేదని, మంత్రి తమను కలవడానికి ఇష్టపడటం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

## అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : జగిత్యాల జిల్లా రాయికల్‌లో దళిత మహిళా ఆశావర్కర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆశావర్కర్‌పై అత్యాచారం జరిగి వారం రోజులవుతున్నా.. నిందితున్ని ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం దారుణమని గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రజాసమస్యలపై కాంగ్రెస్‌ను నిలదీస్తాం

### కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : 'సేవ్ తెలంగాణ, సపోర్ట్ బీజేపీ' అనే నినాదంతో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అడుగడుగునా కాంగ్రెస్‌ను నిలదీస్తామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి అన్నారు. గురువారం నగర బీజేపీ కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయాన్ని తాము మరింత బాధ్యతగా తీసుకుని భవిష్యత్‌లో ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతామని అన్నారు.

# సీఎం వర్సెస్ మంత్రులు

మొదటిపేజీ తరువాయి...

సమాచారం. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా పూర్తిచేసేటలా ప్రాజెక్టుల భూసేకరణ, పనులకు రూ.1,000 కోట్ల అంచనా వ్యయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశంలో ప్రస్తావనకు తీసుకొచ్చినట్టు తెలిసింది. దీనిని క్యాబినెట్ ఆమోదించాలని అభ్యర్థించినట్టు సమాచారం. దీనిపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక్కసారిగా భగ్గుమన్నట్టు తెలిసింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణకు గత బడ్జెట్‌లో రూ.480 కోట్లు కేటాయించగా, మరో 26 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, నీటి పారుదల శాఖ టోకెన్లు జారీ చేసినా, ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్లు ఇవ్వలేదని మంత్రి అన్నట్టు తెలిసింది. తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే ప్రాజెక్టులకు గ్రీన్‌చానల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అనుకున్నప్పటికీ, ఇప్పటివరకు రూపాయి కూడా మంజూరు చేయలేకపోయామని అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. గోదావరి బేసిన్‌లో చిన్న కాళేశ్వరం ఎత్తిపోతలకు రూ.184 కోట్లు, మొడికుంటవాగు ప్రాజెక్టు పనుల పూర్తికి రూ.163 కోట్లు, చనాక–కొరాటా సహా లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టులకు రూ.147 కోట్లు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు రూ.546 కోట్లు, దేవాదులకు రూ.512 కోట్లు, కృష్ణా బేసిన్‌లో కోయిల్‌సాగర్‌కు రూ.121 కోట్లు, భీమాకు రూ.127 కోట్లు, నెట్టెంపాడుకు రూ.67 కోట్లు, కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.489 కోట్లు, డిండి ఎత్తిపోతలకు రూ.1,881 కోట్లు, ఎస్‌ఎల్‌బీసీ పనుల కోసం రూ.1,679 కోట్లు వ్యయం చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఆయకట్టుకు నీటిని అందించే ప్రాజెక్టులకు గ్రీన్‌చానల్ ద్వారా బిల్లుల చెల్లింపులు చేయాలని గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఇంతవరకు మోక్షమే లేదని నీటిపారుదల శాఖ మంత్రి ప్రస్తావించినట్టు తెలిసింది.

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకీ ఓటమి?

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అవమానకర రీతిలో ఓడిపోవడంపై గురువారం నిర్వహించిన క్యాబినెట్ భేటీలో వాడి వేడి చర్చ జరిగినట్టు సమాచారం. ఎన్నికల్లో ఓటమికి కారణాలపై ముఖ్యమంత్రి, మంత్రులు సుదీర్ఘంగా చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిని కేవలం మూడు స్థానాల్లో ఓటమిగా భావించవద్దని, దాదాపు ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఓటమిగా చూడాలని సీనియర్ మంత్రులు సూచించినట్టు సమాచారం. ఈ లెక్కన రాష్ట్రంలో 70% జిల్లాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నట్టు స్పష్టమైందనే అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీల నియోజకవర్గాల్లో ఎంత విస్తృతంగా ప్రచారం చేసినా, ఓటర్లు విద్యావంతులు కావడంతో మన మాట నమ్మలేదని సీనియర్ మంత్రులు వ్యాఖ్యానించినట్టు తెలిసింది. వీళ్లు ఏ ఒక్క రంగానికో, ఏ ఒక్క సామాజిక వర్గానికో పరిమితం కాదని, అన్ని వర్గాల ప్రజల అసంతృప్తికి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని హెచ్చరించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## 38వ సారి ఢిల్లీకి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం 38వ సారి ఢిల్లీకి వెళ్లనున్నట్టు తెలిసింది. ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్న ఆయన సాయంత్రం ఓ మీడియా కాన్‌క్లేవ్‌లో పాల్గొననున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ఆయన అధిష్ఠానం పెద్దలను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై చర్చించనున్నట్టు సమాచారం. తరుచూ ఢిల్లీకి వెళ్తుండడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

## ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా జానారెడ్డి?

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని నియమించనున్నట్టు తెలిసింది. ఆయన గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు శాలువాకప్పి సత్కరించారు. అనంతరం ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా అవకాశమివ్వాలని విజ్ఞప్తిచేయగా సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు జోరుగా ప్రచారం సాగుతున్నది.జానారెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తే ఒకే ఇంటికి మూడు పదవులు ఎలా ఇస్తారనే విమర్శలు వస్తున్నాయి.

# సీఎం వచ్చారు.. ఓడించారు!

- రేవంత్‌రెడ్డి పర్యనటకు ముందు జోష్ మీదున్న నరేందర్‌రెడ్డి
- ఆయన వచ్చిపోయిన తరువాతనే ఫలితం తారుమారు
- ఎమ్మెల్సీ ఓటమిపై నరేందర్‌రెడ్డి అనుచరుల మండిపాటు

హైదరాబాద్, మార్చి 6 (నమస్తే తెలంగాణ): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సీఎం రాకపోయి ఉంటే, తమ నేత సునాయాసంగా గెలిచేవారని, గెలుపు ముంగిట నిలిచిన వ్యక్తిని కాళ్లు పట్టి గుంజి కింద పడేసినట్టు అయిందని కాంగ్రెస్ అభ్యర్థి ఆల్‌ఫోర్స్ నరేందర్‌రెడ్డి అనుచరులు వాపోతున్నారు. సీఎం అత్యుత్సాహంతో చేసిన వ్యాఖ్యలే తమ నేత కొంప ముంచాయిని విమర్శిస్తున్నారు. ఏడాది పాలన సంతృప్తికరంగా లేరని తెలిసినప్పటికీ, మాకు ఓటు వేయండని రేవంత్‌రెడ్డి చెప్పడంతో పట్టభద్రులు మర్లబడ్డారని దిగువ శ్రేణి నాయకత్వం చర్చించుకుంటున్నది.

### ఏడుగురు మంత్రులు..23 మంది ఎమ్మెల్యేలు..14 వేల మంది కార్యకర్తలు

కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్–మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి సిట్టింగ్ స్థానం. ఈ స్థానాన్ని నిలుపుకోనేందుకు సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పక్కన పెట్టి ఆర్థికంగా స్థితిమంతుడు, విద్యా వ్యాపారి వుట్కూరి నరేందర్‌రెడ్డిని బరిలోకి దింపారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని 42 అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తరించిన ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గెలవటానికి కాంగ్రెస్ పార్టీ భారీ కసరత్తే చేసింది. ఏ ఒక్క ఓటునూ జారవిడుచుకోవద్దనే లక్ష్యంతో ఏడుగురు మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దింపింది. వీరు కాకుండా మొత్తం 14 వేల మందిని ప్రచారంలో దించారు. వీరితోపాటు ముఖ్యమంత్రి కూడా కరీంనగర్, నిజామాబాద్, మంచిర్యాల బహిరంగసభల్లో పాల్గొన్నారు. ఓటరును ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరిగినా ఓటమిని ఆపలేకపోయారని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు.

### సీఎం రాకతో అంతా తారుమారు

ఒక ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వెళ్లటం, ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో, తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనూ ఇదే తొలిసారి. అయితే ఆయన ప్రచారమే కొంప ముంచిందని, లేకుంటే నరేందర్‌రెడ్డి సునాయాసంగా గెలిచేవారని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటివరకు అమలు చేయలేదని తెలిసి కూడా, తమ ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం మంచి చేసిందని మీరు అనుకుంటేనే మాకు ఓటు వేయండని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునివ్వటం తమ నాయకుని అదృష్టాన్ని మార్చివేసిందని నరేందర్ అనుచరులు విమర్శిస్తున్నారు. పట్టభద్రులను మెల్లమెల్లగా తమకు అనుకూలంగా మారుతున్న సమయంలో సీఎం వచ్చి అంతా తారుమారు చేశారని వాపోయారు.

### బెడిసికొట్టిన బీసీ నివేదిక..

కుల గణన సర్వే తప్పులతడక అని కాంగ్రెస్ నాయకులే ధిక్కార స్వరం వినిపిస్తుండటంతో, బీసీ పట్టభద్రులు ఆలోచనలో పడ్డట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. బీసీలకు 42శాతం టికెట్లు ఇస్తామని చెప్పి, వారిలో ముస్లింలను కూడా కలపడాన్ని బీజేపీ ప్రచార అస్త్రంగా మార్చుకున్నదని అంటున్నారు.

### ఓటమికి బాధ్యులు ఎవరు?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి బాధ్యతను ఎవరు తీసుకుంటారనే అంశంపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నిక టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా నిజామాబాద్ పరిధిలో జరిగినందున ఆయనే బాధ్యత వహించాలనే డిమాండ్ పెరుగుతున్నట్టు తెలిసింది. గతంలో సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్ పార్లమెంటు ఎన్నికల సమయంలో కూడా వ్యతిరేక ఫలితాలు వచ్చాయని, దీనికి సీఎం బాధ్యత వహించాల్సి ఉండెనని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి.